వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద, అధికారులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద కొనియాడారు. జిల్లా బీసీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పాలనాధికారి పూలమాలలు వేశారు. మహనీయుల జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి పుష్పలత, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

రంగనాథస్వామిని తాకిన సూర్య కిరణాలు



కాశీబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వర, రంగనాథ స్వామి ఆలయంలో గురువారం ఉదయం స్వామి విగ్రహంపై సూర్య కిరణాలు పడినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి చిలుపూరి సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. – న్యూస్‌టుడే, కాశీబుగ్గ

కిలోల్లో కొంటున్నారు ›› టన్నుల్లో తరలిస్తున్నారు!

జోరుగా రేషన్ బియ్యం దందా..

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, నర్సంపేట, కమలాపూర్, వరంగల్ క్రైం



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దందా జోరుగా సాగుతోంది. పట్టణాలు, గ్రామాల్లోనే కాకుండా ఏజెన్సీ ప్రాంతాలకూ ఇది విస్తరించింది..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 11,11,401 కార్డుదారులకు ప్రతి నెలా 2,266 చౌకధరల దుకాణాల ద్వారా సుమారు 23 వేల టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇందులో 2,250 టన్నులకుపైగా పక్కదారి పడుతోంది.



ఎలా చేస్తారంటే..

పేదల బియ్యంతో రూ.లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు, మిల్లర్లు.. పోలీసులకు చిక్కకుండా రకరకాల ఎత్తులు వేస్తున్నారు. రేషన్ దుకాణాలు, లబ్ధిదారుల నుంచి సేకరించిన రాయితీ బియ్యాన్ని టన్నుల కొద్దీ నిల్వ చేస్తారు. అర్ధరాత్రి లారీల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తారు.



1 రేషన్ దుకాణాల ద్వారా..

లబ్ధిదారులు తమ కార్డును కోల్పోకుండా ఉండేందుకు ప్రతి నెలా చౌకధరల దుకాణం వద్దకు వెళ్లి రేషన్ తీసుకుంటున్నట్లు వేలిముద్రలు వేసి వస్తున్నారు. దుకాణదారుడు వారికి కిలోకు రూ.10 చొప్పున లెక్క కట్టి డబ్బులు ఇస్తున్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కొందరు డీలర్లు లబ్ధిదారులకు డబ్బులకు బదులు సబ్బులు, సర్ఫు, గోధుమ పిండి, బొళ్ల సబ్బులు అందజేస్తున్నారు. అలా పోగైన బియ్యాన్ని మిల్లర్లకు రూ.14 నుంచి రూ.16 చొప్పున రాత్రి సమయంలో మిల్లులకు తరలిస్తున్నారు.

2 సన్నబియ్యంగా మార్చి

రేషన్ దుకాణాలతో పాటు ఇంటింటా కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని మిల్లర్లు తమ రైస్ మిల్లుల్లో సన్నబియ్యంగా మార్చుతున్నారు. అలా మరపట్టిన బియ్యాన్ని 25 కిలోల సంచుల్లో నింపి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.60 మధ్య విక్రయిస్తున్నారు.

3 నూకలుగా..

పౌల్ట్రీఫారాలు, బీర్ల తయారీ కంపెనీల్లో నూకల వినియోగం పెరిగింది. దీంతో వాటికి డిమాండ్ అధికమైంది. దళారులు లబ్ధిదారుల నుంచి రూ.8 నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసిన బియ్యాన్ని మిల్లర్లకు రూ. 12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. నూకలుగా మరపట్టిన మిల్లర్లు కిలోకు రూ. 18 లేదా రూ.20 చొప్పున అవసరమున్న ప్రాంతాలకు తరలిస్తున్నారు. ● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ డివిజన్‌లో కొందరు అక్రమార్కులు సామర్థ్యం తక్కువ కలిగిన మిల్లులను స్థాపించుకుని బియ్యాన్ని నూకలుగా మరపడుతున్నారు.

సీఎంఆర్ లక్ష్యం కోసం..

వరంగల్ జిల్లా నల్లబెల్లి, దుగ్గొండి, పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా గూడూరు, కేసముద్రం, మరిపెడ, హనుమకొండ జిల్లా కమలాపూర్ తదితర మండలాల్లోని మిల్లర్లే చౌక బియ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఏటా ధాన్యం కొనుగోలు సమయంలో వారికి కేటాయించిన ధాన్యాన్ని అధిక ధరలకు పక్కదారి పట్టిస్తున్నారు. సీఎంఆర్ లక్ష్యాన్ని భర్తీ చేసుకునేందుకు తక్కువ ధరకు లభించే పేదల బియ్యాన్ని టన్నుల కొద్దీ కొనుగోలు చేస్తున్నారు. వాటిని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద లెక్కలు చూపిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ఇదీ పరిస్థితి..



హనుమకొండ జిల్లా పరకాలలోని శ్రవణ్‌కుమార్ బిన్ని రైస్‌మిల్లరు రాయితీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ పౌరసరఫరాలశాఖకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం పోలీసులు మిల్లుపై దాడి చేశారు. అందులో రూ.12.81 లక్షల విలువ చేసే 325 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని, 187.5 క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు.



ఇది 30 టన్నుల రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీ. ఇటీవల మహారాష్ట్ర వైపు వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.

మాఫియాలా బియ్యం డాన్‌లు

ఉమ్మడి జిల్లాలో చౌక బియ్యం మాఫియా విస్తరిస్తోంది. జిల్లాకు ఇద్దరు నుంచి నలుగురు చొప్పున దందా చేస్తూ బియ్యం డాన్‌లుగా ఎదిగారు. యువత, మైనర్లు పావులుగా మారుతున్నారు. దళారులకు ద్విచక్రవాహనం, సంచులు, డిజిటల్ కాంటాలు అప్పగించి ఊళ్లలోకి పంపిస్తున్నారు. వారు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొంటారు. డిజిటల్ కాంటాలపై తూకాలు చేస్తున్నారు. బస్తా బరువు 50 కిలోలు కాగానే వాహనంపై తమ రహస్య ప్రదేశానికి తరలిస్తారు. ఇందుకోసం అక్రమార్కులు పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

● వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్‌లో ఒక వ్యక్తి చక్రం తిప్పుతున్నారు. పోలీసు, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులను మచ్చిక చేసుకొని ఆ ప్రాంతంలో దందాను కొనసాగించే ఇతరులను పట్టిస్తున్నారు. తాను మాత్రం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు 15 నుంచి 20 క్వింటాళ్ల చొప్పున ప్రయాణికుల ఆటోల్లో నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు.

● హనుమకొండ జిల్లాలో బడా దళారీ అక్రమానికి అడ్డూ అదుపు లేదు. మండలాల వారీగా మధ్యదళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని రూ.కోట్లు గడిస్తున్నారు.


వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలో లబ్ధిదారుల నుంచి అక్రమంగా బియ్యం కొనుగోలు చేసి బస్తా 50 కిలోలు కాగానే స్కూటీపై తీసుకెళ్తున్న యువకులు

అంగట్లో సరకులా.. వ్యాపార అనుమతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే


వరంగల్ 25 డివిజన్‌లో ట్రేడ్ లైసెన్సు రుసుం వసూలు చేస్తున్న ఉద్యోగులు

పైసలిచ్చుకో.. ట్రేడ్ లైసెన్సులు తీసుకో.. అనే విధంగా ఉంది గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం తీరు. డబ్బులకు కక్కుర్తి పడి నకిలీ వ్యాపార సంస్థలకు అడ్డగోలుగా అనుమతి జారీ చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకు రుణాల కోసం కొందరు కాగితాల్లోనే దుకాణాలు, ఇతర వ్యాపారులు సృష్టిస్తున్నారు. బ్యాంకు రుణం పొందగానే తాత్కాలిక బోర్డులు, ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. 'వన్ టైం ట్రేడ్' లైసెన్సులతో గ్రేటర్ వరంగల్‌లో బకాయిలు పేరుకుపోతున్నాయి. నాలుగేళ్ల క్రితం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి సుమారు 6-7 వేల నకిలీ వ్యాపార అనుమతులు(ట్రేడ్ లైసెన్సులు) రద్దు చేశారు. సుమారు రూ.5-6 కోట్ల పాత బకాయిలు రద్దయ్యాయి. ఈ విషయం తెలిసి కూడా ప్రజారోగ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు నకిలీ వ్యాపారులకు కొత్తగా అనుమతి జారీ చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.5- 8 వేల వరకు వసూలు చేశారని తెలిసింది.

వసూళ్లపై అశ్రద్ధ

ట్రేడ్ లైసెన్సు వసూళ్లపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు అశ్రద్ధ వహిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ట్రేడ్ లైసెన్సు రుసుంల వసూళ్ల లక్ష్యం రూ.12.77 కోట్లు కాగా, రూ.3.19 కోట్లు రాబట్టారు. ఇంకా రూ.9 కోట్ల బకాయిలున్నాయి. అందులో పాత బకాయిలు రూ.3.05 కోట్లు ఉండగా.. కొత్తవి రూ.6 కోట్ల వరకు ఉంటాయి.

ప్రత్యేక దృష్టి సారించాం

- డాక్టర్ రాజిరెడ్డి, ముఖ్యఆరోగ్యాధికారి, గ్రేటర్ వరంగల్

ట్రేడ్ లైసెన్సు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. పాతవి, కొత్త బకాయిలు నగరంలోని 66 డివిజన్ల వారీగా సిద్ధం చేసి జవాన్లకు పంపించాం. నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాలని ఆదేశించాం.

32,765 మంది వ్యాపారులు

- గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం అధికారిక లెక్కల ప్రకారం 32,765 మంది వ్యాపారులు ఉన్నారు. కాజీపేట సర్కిల్‌లో 17,983, కాశీబుగ్గ సర్కిల్‌లో 14,782 వ్యాపారాలకు అనుమతి ఉంది. రెండు, మూడేళ్లుగా 8-9 వేల మంది వ్యాపారులు రుసుం చెల్లించడం లేదు. నగరంలోని 66 డివిజన్లలో పరిశీలించినా దుకాణాల జాడ దొరకడం లేదు.
- పాత బకాయిలు రూ.3.05 కోట్లు ఉన్నాయి. కాశీబుగ్గ సర్కిల్‌లో రూ. 1.09 కోట్ల పాత బకాయిలుంటే రూ. 9.65 లక్షలు వసూలయ్యాయి. కాజీపేట సర్కిల్‌లో రూ.1.96 కోట్లు ఉండగా, కేవలం రూ.7.65 లక్షలు వసూలు చేశారు.
- కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లోనే అత్యధికంగా నకిలీ వ్యాపార సంస్థలు ఉన్నాయని తెలిసింది. కాశీబుగ్గ సర్కిల్‌లో కొన్ని డివిజన్లలో తప్పుడు ఇంటి నంబర్లు చూపించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఒక్కటై కమీషన్లకు ఆశపడి నిబంధనలకు విరుద్ధంగా ట్రేడ్ లైసెన్సులు ఇచ్చారు.
- కరీమాబాద్ వార్డు కార్యాలయం పరిధిలో ఓ ప్రైవేటు జవాన్ లైసెన్సులు ఇప్పిస్తానని చెప్పి రూ.2 లక్షలు వసూలు చేశారు. గతంలో తొలగించిన జవాన్‌ను మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

గీత దాటితే అంతే!

నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా వాణిజ్య దుకాణాల ముందు వాహనాలు నిలపకుండా.. ట్రాఫిక్ పోలీసులు ఎరుపు గీతను ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనాలు ఈ గీత లోపలే నిలపాలని సీఐ రామకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా వరంగల్ చౌరస్తా, ఆర్‌ఎన్‌టీ రోడ్డు మార్గంలో ఎరుపు గీత వేయించారు. త్వరలో నగరంలోని ప్రతి వాణిజ్య దుకాణం ముందు గీత గీస్తామని.. అది దాటితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. – న్యూస్‌టుడే, మట్టెవాడ

మస్తుగా తాగేశారు..!

● 14 రోజుల్లో రూ.142.79 కోట్ల మద్యం విక్రయాలు



ఉమ్మడి వరంగల్ జిల్లాలో దసరా సందర్భంగా మద్యం విక్రయాలు రాష్ట్రంలోనే రికార్డును సాధించాయి. రాష్ట్రంలోనే అధిక పెరుగుదల నమోదైంది. వరంగల్ పట్టణ, రూరల్ పరిధిలో 49.88, జనగామ జిల్లాలో 89.87 శాతం విక్రయాలు పెరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 వైన్స్, 134 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. గతేడాది పండగ సందర్భంగా రూ.95.53 కోట్ల అమ్మకాలు జరిగితే.. ఈసారి అదే 14 రోజుల్లోనే రూ.142.76 కోట్లకు చేరడం గమనార్హం. దాదాపు రూ.48.26 కోట్లు ఎక్కువగా జరిగాయి. ఈ నెల చివర్లో దీపావళి ఉండటంతో విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఆబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు. – వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

ఇవీ కారణాలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మద్యం విక్రయాలు ఎక్కువగా పెరగడానికి పలు కారణాలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది గొలుసు దుకాణాలు. గ్రామగ్రామాన కిరాణ దుకాణాలు, ఇళ్లల్లోనూ విక్రయిస్తున్నారు. సమయపాలన పాటించకుండా అవి తెరిచే ఉంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలు అది దొరుకుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు నగర శివారులో గొలుసు దుకాణాలు ఎక్కువగా ఉండటంతో వారు వైన్స్‌ల నుంచి మద్యం తీసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వరంగల్ నగరంలో ఎక్కువ విద్యా సంస్థలు ఉంటాయి. యువత ఎక్కువగా కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు, పిల్లలకు విక్రయించలేదని చెప్పారు.

హనుమకొండ ఏసీపీకి అతి ఉత్కృష్ట సేవా పతకం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులకు ఇచ్చే ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 410 మందిని ఎంపిక చేసింది. హనుమకొండ ఏసీపీ కె. దేవేందర్‌రెడ్డికి అతి ఉత్కృష్ట పతకం లభించింది. కరీంనగర్ జిల్లాకు చెందిన ఈయన 1996లో ఆర్‌ఎస్సైగా ఉద్యోగంలో చేరారు. తర్వాత సివిల్ ఎస్సైగా కన్వర్షన్ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఠాణాల్లో ఎస్సై, సీఐగా విధులు నిర్వర్తించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో సమర్థంగా విధులు నిర్వర్తించి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. పోలీస్‌శాఖలో పలు పతకాలు అందుకున్న దేవేందర్‌రెడ్డి తాజాగా అతి ఉత్కృష్ట అవార్డుకు ఎంపిక కావడంతో పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.

ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు


ఎంపికైన క్రికెటర్లతో సంఘం ప్రతినిధులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన ఎంపిక పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన అండర్-23 క్రికెటర్లు హాజరయ్యారు. జిల్లాల వారీగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో నైపుణ్యాలు పరీక్షించారు. ఒక్కో జిల్లా నుంచి 18 మంది ఆటగాళ్లను ఎంపిక చేసినట్లు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఆరు జిల్లాల నుంచి 108 మంది క్రికెటర్లను ఎంపిక చేశామన్నారు. ఇందులో నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపిక కోసం ఈ నెల 20 నుంచి 23 వరకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం ప్రతినిధులు మట్టెడ కుమార్, వినయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

పార్కుల్లో విండ్రో కంపోస్టు యూనిట్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని ప్రతి పార్కులో విండ్రో కంపోస్టు యూనిట్లు, వర్మీ కంపోస్టు షెడ్లు ఏర్పాటు చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఇంజినీరింగ్, ఉద్యాన విభాగాల అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. పార్కుల్లో వెలువడే వ్యర్థాలు శుద్ధి చేసేందుకు విండ్రో, వర్మీ కంపోస్టు యూనిట్లు ఉపయోగపడతాయని మేయర్ తెలిపారు. పార్కుల నిర్వహణను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఎస్ఈ రాజయ్య, హెచ్‌ఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతితో లాభాలు


పత్తి పంటలో మహిళా రైతును సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డా.రాజన్న, డా.సౌమ్య

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: రైతులు అధిక సాంద్రత పత్తి పంట సాగుపై దృష్టి సారించి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి దినోత్సవాల్లో భాగంగా గురువారం ఖిలావరంగల్ తూర్పుకోట ప్రాంతంలో సాలు పద్ధతిలో పత్తి పంట సాగుచేస్తున్న వనపర్తి కర్ణాకర్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం స్థానిక రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడిని సాధించేందుకు ఈ పద్ధతిని పాటించాలన్నారు. రైతుల సందేహాలకు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.రాజన్న, శాస్త్రవేత్త డా.సౌమ్య సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ డా.సత్యశారద హాజరుకావాల్సి ఉండగా.. పాలనాపరమైన కారణాలతో రాలేకపోయారు. నూజివీడు విత్తన సంస్థ రీజినల్ మేనేజర్ రమణారెడ్డి, ఏరియా సేల్స్ మేనేజర్ మురళీమోహన్, డిస్ట్రిబ్యూటర్ రామచంద్రరెడ్డి, ఏవోలు రవీందర్‌రెడ్డి, హరిప్రసాద్, ఏఈవో చంద్రకాంత్, కార్పొరేటర్ బోగి సువర్ణ పాల్గొన్నారు.


వానమ్మా.. వందనం!

ముగిసిన నైరుతి.. మురిసిన ఓరుగల్లు

– న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వానాకాలం కలిసి వచ్చింది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో చెరువులు, కుంటలు నిండాయి. భూగర్భ జలాలు పెరిగాయి. అన్నదాతలు అప్పుడే యాసంగి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. జూన్‌లో మొదలైన నైరుతి సీజన్ సెప్టెంబరుతో ముగిసినా అక్టోబరు రెండో వారం వరకు అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

జిల్లాల్లో అధికంగా నమోదైన వర్షపాతం (శాతం)



మండలాలవారీగా అధిక వర్షపాతం శాతం

మండలం	శాతం
మహబూబాబాద్	
చిన్న గూడురు	117
మరిపెడ	100
నర్సింహులపేట	96
నెల్లికుదురు	60
దంతాలపల్లి	57
మహబూబాబాద్	44
కురవి	42
ములుగు	
ఏటూరునాగారం	101
మంగపేట	47
వెంకటాపురం	40
తాడ్వాయి	37
గోవిందరావుపేట	36
జనగామ	
కొడకండ్ల	50
జనగామ	24
భూపాలపల్లి	
మల్హార్‌రావు	30
కాటారం	28
రేగొండ	23
మహదేవ్‌పూర్	23
వరంగల్	
దుగ్గొండి	42
వర్ధన్నపేట	41
పర్వతగిరి	34
హనుమకొండ	
భీమదేవరపల్లి	34
ధర్మసాగర్	28
ఎల్కతుర్తి	24

సాగుబడికి చెరువుల నీరు

ఇది హసన్‌పర్తి మండలం నాగారం చెరువు. ఉమ్మడి జిల్లాలో 3,900 చెరువులు, కుంటలున్నాయి. ఈసారి 65 శాతం పూర్తి స్థాయిలో నిండాయి. మిగతావాటిలో 50 నుంచి 75 శాతం వరకు నీరు చేరింది. వీటికింద 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.



జిల్లాల వారీగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షపాతం (మి.మీ.)

జిల్లా	సాధారణం	నమోదైంది
ములుగు	1200	1603.8
మహబూబాబాద్	878.0	1280.5
జయశంకర్	985.8	1159.8
వరంగల్	901.0	1082.5
హనుమకొండ	875.7	981.5
జనగామ	755.2	829.2

పంటలకు మేలు

- తోకల ఆదిరెడ్డి, రైతు, సీతంపేట, హసన్‌పర్తి



ఈసారి సకాలంలో వర్షాలు పడ్డాయి. యాసంగిలో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. చెరువులతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వరి పంటకు నీరందించే అవకాశం ఉన్నందున యాసంగి సాగుపై ఆశలు పెంచుకున్నాం.

సాగు విస్తీర్ణం పెరుగుతుంది

- రవీంద్రసింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఆశించిన మేరకు వర్షాలు కురిశాయి. దీంతో జలశయాల్లోకి వరదనీరు చేరింది. నీరు లేని చెరువుల్లోకి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నింపుతారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుంది.



పంటలకు నీరు అందిస్తున్న రైతు




ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో నిండుగా వ్యవసాయ బావి

రైతులకు మద్దతుగా పత్తి కొనుగోళ్లు!

ఈ ఏడాది పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధంగా ఉంది.. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం అని మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ తెలిపారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులు, మద్దతు ధరపై అవగాహన, ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం 'ఈనాడు' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు జేడీఎం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

–ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ఈనాడు ఫోన్ ఇన్

మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.శ్రీనివాస్

? పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకొస్తే.. సీసీఐ కొనుగోలుచేస్తుందా? **– యాకూబ్, కొత్తూరు, ఖానాపురం మండలం, వరంగల్ జిల్లా**

✔ రైతులు పత్తిని మిల్లులకు బస్తాల్లో తీసుకురావొద్దు. విడి పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ప్లాస్టిక్, గన్నీ సంచుల్లో తీసుకురావడం వల్ల ఆ బస్తాల్లోని పోగులు పత్తితో కలిసిపోయి నాణ్యత దెబ్బతినే ప్రమాదముంది. స్పిన్నింగ్ చేసే సమయంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయి.

? ఈ ఏడాది అకాల వర్షాలతో పత్తి దిగుబడి తగ్గింది. కొంతమేర మచ్చ వచ్చి రంగు మారింది. పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు వాతావరణ పరిస్థితుల కారణంగా తేమ శాతం ఎక్కువగా ఉంది. ఇలాంటి పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందా? **– (శ్రీనివాస్, మరిపెడ, మహబూబాబాద్ జిల్లా), (శివశంకర్, ఆత్మకూరు, హనుమకొండ జిల్లా), (సతీశ్, వెన్నారం, దోర్నకల్), (అన్నా తిరుపతి, ములుగు జిల్లా), (వెంకటేశ్వర్, దోర్నకల్), (తోట రాజేందర్, అబ్బాపూర్, ములుగుజిల్లా)**



✔ నిబంధనల ప్రకారం పత్తిలో 8 నుంచి 12 వరకు తేమ శాతం ఉంటేనే కనీస మద్దతు ధర రూ.7,521కు సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమశాతం సడలింపు, నాణ్యత లేకున్నా కొనుగోలు చేసే అవకాశం లేదు. రైతులు మొత్తం వచ్చిన దిగుబడిలో మంచి పత్తిని, నాణ్యత లేనిది వేరు చేయాలి. నాణ్యమైన పత్తిని సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందొచ్చు. మిగిలినది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవచ్చు. ఉదయం కాకుండా మధ్యాహ్నం పత్తిని ఏరడం ద్వారా తేమశాతాన్ని తగ్గించొచ్చు.

? ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేసి దాన్ని సీసీఐకి విక్రయిస్తూ.. లబ్ధి పొందుతున్నారు. ఈసారి మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులను నియంత్రిస్తారా? **– (మహేశ్ హాజంపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా), (శ్రీనివాస్, ఖిలాషాపూర్, జనగాం జిల్లా)**

✔ ఈ ఏడాది నోటిఫై చేసిన మిల్లుల్లో ప్రైవేటు వ్యాపారులు పత్తి కొనుగోళ్లు జరపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహిస్తే.. సంబంధిత మిల్లు యజమానులపై చర్యలు తీసుకుంటాం. సీసీఐ కాకుండా ఇతర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు గుర్తిస్తే.. మిల్లుల్లో సమస్యలపై ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన నెంబర్ల ద్వారా సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

? ప్రైవేటు వేబ్రిడ్జిలకు, మిల్లుల్లోని వేబ్రిడ్జిలకు ఒక్కోసారి తూకాల్లో తేడాలు వస్తున్నాయి. దాంతో రైతులు నష్టపోతున్నారు. తూకాల్లో మోసాలను ఎలా అరికడతారు? **- బుస్సారి లక్ష్మణ్, కంచరపల్లి, రఘునాథపల్లి మండలం, జనగామ జిల్లా**

✔ మిల్లుల్లో పంట ఉత్పత్తుల తూకాల్లో ఉద్దేశపూర్వకంగా మోసాలకు పాల్పడితే సంబంధించిన వారిపై చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు అధికారులతో వేబ్రిడ్జిల తనిఖీలు నిర్వహిస్తానే. తూకాల్లో తేడాలొచ్చినట్లు అనుమానం వస్తే.. రైతులు.. తూనికలు, కొలతలు, మార్కెటింగ్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

తూనికలు, కొలతలు అధికారుల నెంబర్లు

జనగామ - 9440575081

హనుమకొండ, భూపాలపల్లి, ములుగు జిల్లా - 9963311956

వరంగల్ - 9885558028

మహబూబాబాద్ - 9177661663

? దళారులు గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తూ.. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? **- బి.సాంబయ్య, నల్లబెల్లి, వరంగల్ జిల్లా**

✔ ఆరుగాలం పండించిన పంటను దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దు. దగ్గర్లోని మార్కెట్ కమిటీల్లో, సీసీఐ నోటిఫై చేసిన మిల్లుల్లో పత్తిని అమ్మడం ద్వారా మార్కెటింగ్‌శాఖ రైతు సరకుకు జవాబుదారీగా ఉంటుంది. గిట్టుబాటు ధరతో పాటు నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లిస్తుంది. తరుగు పేరుతో దళారులు చేసే మోసాలకు మార్కెటింగ్‌శాఖ బాధ్యత వహించదు.

? పత్తి రైతుల కోసం మార్కెటింగ్‌శాఖ ప్రవేశపెట్టిన వాట్సప్ నెంబరులో రైతు వ్యక్తిగత చరవాణి నెంబరు నమోదుచేసినా పండించిన పంట వివరాలు రావడం లేదు? **- రమేశ్, దేవరుప్పుల, జనగామ జిల్లా**

✔ ఎన్ఐసీ ఇచ్చిన డేటా ఆధారంగా మార్కెటింగ్‌శాఖ పంట నమోదుచేసిన 21,65,326 మంది రైతులతో వాట్సాప్ నెంబరు (88972 81111)ను రూపొందించింది. ఈ నెంబరు సహాయంతో రైతులు సాగుచేసిన పత్తి వివరాలు, ఎన్ని క్వింటాళ్ల వరకు సీసీఐకు విక్రయించేందుకు అవకాశముంది.. తదితర వివరాలను ముందస్తుగా తెలుసుకోవచ్చు. ఇందులో రైతు వివరాలు రానంత మాత్రాన సీసీఐకు పంట విక్రయించవద్దనే నిబంధన లేదు.

? వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పండించిన పంట విస్తీర్ణం కన్నా.. తక్కువ నమోదు చేస్తే. ఏంచేయాలి? **- రవీందర్, తొర్రూర్, మహబూబాబాద్ జిల్లా**

✔ వ్యవసాయ అధికారులు నమోదు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగానే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. సీసీఐ నిబంధనల ప్రకారం.. ఆధార్ నెంబరు ప్రామాణికీకరణ, రైతు వేలిముద్రలు, ఓటీపీ ద్వారా ఒక్కో రైతు నుంచి ఎకరానికి 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసే అవకాశముంది. ఒకవేళ వ్యవసాయ విస్తరణాధికారులు సాగు విస్తీర్ణాన్ని తక్కువగా నమోదు చేస్తే.. ఆ రైతులు సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించిన పత్రాన్ని సీసీఐ అధికారులకు సమర్పించాలి.

19 నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

సుబేదారి, న్యూస్‌టుడే: హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 19 నుంచి 21 వరకు అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. గురువారం కళాశాలలో వివరాలు వెల్లడించారు. కేయూ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 800 మంది హాజరవుతారన్నారు. బ్యాడ్మింటన్‌లో 12, హ్యాండ్ బాల్‌లో 14, కబడ్డీ 29, ఖోఖోలో 7, సాఫ్ట్‌బాల్‌లో 11 టీములు పాల్గొంటాయన్నారు. ప్రారంభం రోజు నుంచి పోటీలు ముగిసే వరకు మైదానంలో వాకర్స్‌కు అనుమతి లేదన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్, పీడీ భాస్కర్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

ఇసుక దందాపై స్పందించిన కేటీఆర్



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ వ్యాపారంపై ఈ నెల 14 'ఇసుక దందా.. వారికి మామూలే' శీర్షికన ఈనాడులో ప్రచురించిన కథనానికి మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని జత పరుస్తూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం అంటూ పోస్టు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఇసుక మాఫియాకు అభయ హస్తం అంటూ వాగ్బాణాలు సంధించారు.

ఈనాడు కథనానికి స్పందన

ఆర్టీసీ బస్సులు రైట్.. రైట్..



హనుమకొండలోని నయాంనగర్ కొత్త వంతెన మీదుగా ఆర్టీసీ బస్సులు పరుగులు ప్రారంభించాయి. వంతెన నిర్మాణం పనులు పూర్తై, ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నా.. ఆర్టీసీ బస్సులు తిరగడం లేదని, ఇతర రూట్లలో తిరగడంతో సమయం వృథా కావడంతో పాటు ప్రయాణికులకు టికెట్‌పై అదనపు భారం తప్పడం లేదంటూ 'ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర వార్తకు ఆర్టీసీ, పోలీసు అధికారులు స్పందించారు. వంతెన మీదుగా బస్సులకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచి హనుమకొండ బస్సులను ఈ మార్గంలో పంపించారు. దీంతో కరీంనగర్, హుజూరాబాద్, నిజామాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం ముందుగా బయలు బస్సులకు అదనపు ఛార్జి రూ.10 వసూలు చేశారని, తరవాత బస్సులకు అదనపు ఛార్జి తొలగించామని చెప్పారు. **– న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా**

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా విద్యార్థులు, యువతి, యువకులకు జిల్లా, రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలు నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభ తెలిపే విధంగా ఈ మధ్య తీసిన మూడు ఫొటోలు, మూడు నిమిషాల నిడివితో తీసిన షార్ట్‌ఫిలిం పెన్‌డ్రైవ్‌ను రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 22లోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పీఆర్‌వోకు అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలు పెంచే అంశాలకు సంబంధించి గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు తీసిన ఫొటోలు, షార్ట్‌ఫిలిం వీడియోలను మాత్రమే పంపించాలన్నారు. పూర్తి వివరాలకు పీఆర్‌వో సెల్ 87126-85050 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వనదేవతల కటాక్షం..

మహా జాతర శాశ్వత పనులకు శ్రీకారం!

మేడారం మహాజాతర పనులు ఎప్పుడూ సమయానికి పూర్తి కావు.. జాతరకు ఐదారు నెలల ముందు సమావేశాలు నిర్వహించడం, రెండు నెలల ముందే నిధులు మంజూరు చేయడం, హడావుడిగా పనులు చేపట్టడం జరుగుతుండేది. ఈ ఆనవాయితీకి స్వస్తి పలికేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. జాతరతో సంబంధం లేకుండా మేడారంలో చేపట్టాల్సిన శాశ్వత పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. –తాడ్వాయి, న్యూస్‌టుడే(ములుగు జిల్లా)



మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి

మేడారం మహాజాతర 2026 ఫిబ్రవరిలో జరిగే అవకాశం ఉంది.. అంటే మరో ఏడాదిన్నర ఉంది.. గత అనుభవాల దృష్ట్యా మహాజాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క ఇప్పుడే ప్రత్యేక దృష్టిసారించారు. గత మే నెలలోనే జిల్లా కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించి మేడారం అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఏయే పనులు ఎప్పుడు చేయాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు. ఈ నెల 4న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కార్యాచరణ ప్రారంభించిన కలెక్టర్

కలెక్టర్ టీఎస్.దివాకర ఇప్పటికే రెండు సార్లు జాతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన పనులను గుర్తించడం, గత జాతరలో ఎదుర్కొన్న ఇబ్బందులపై పూర్తిస్థాయిలో వివిధ శాఖలను అడిగి తెలుసుకొన్నారు. గత జులై 11న మేడారంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

రూ.17.25 కోట్లు మంజూరు


గతంలో జాతర నిర్వహణకు కొద్దిరోజుల ముందే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండేది. దీంతో అవి పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయ్యేవి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈసారి అధికారులు ముందుగానే మేల్కొన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పంపించిన రూ.17.25 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ప్రతిపాదనలు.. మంజూరైన నిధులు (రూ.కోట్లలో)

- సీఆర్ఆర్ పథకం ద్వారా కాల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 8
- మేడారంలోని శివరాంసాగర్ చెరువు నుంచి రిజర్వ్ ఫారెస్టు వరకు రోడ్డు విస్తరణ: 2.75
- ఎమ్మార్ పథకంలో నార్లాపురం చెక్‌పోస్టు నుంచి కాల్వపల్లి వరకు తారు దారి: 2.50
- మేడారం అమరవీరుల స్థూపం నుంచి ఊరట్టం వరకు రహదారి నిర్మాణం: 2
- మేడారం అమరవీరుల స్థూపం నుంచి కన్నెపల్లి సారలమ్మ గుడి వరకు దారి: 2

వీటిలో కొన్ని టెండరు పూర్తయ్యాయి.. త్వరలోనే పనులన్నీ ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్‌రావు తెలిపారు.

అతిథిగృహాల నిర్మాణానికి..



80 శాతం పూర్తయిన పూజారుల అతిథిగృహం

శాశ్వత ఏర్పాట్లే లక్ష్యంగా దేవాదాయశాఖ రూ.3.50 కోట్లతో అతిథిగృహాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పూజారుల అతిథి గృహం 80 శాతం పూర్తయింది. భక్తులు, అతిథుల కోసం అతిథి గృహం నిర్మించేందుకు ప్రభుత్వం మరో రూ.2 కోట్లు మంజూరు చేసింది. రెండు రోజుల కిందట అధికారులు స్థల పరిశీలన చేశారు. దేవాదాయ శాఖ నిర్మాణాలు మరో ఆరు నెలల్లో పూర్తి చేయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు.

19న జాతర పనులకు శంకుస్థాపన

రూ.7.35 కోట్లతో రెండు ప్యాకేజీలుగా చేపట్టే నార్లాపురం చెక్‌పోస్టు-కాల్వపల్లి, ఊరట్టం అమరవీరుల స్థూపం-ఊరట్టం, కన్నెపల్లి ఆర్చిగేటు-సారలమ్మ గుడి, మేడారం ఆర్అండ్‌బీ రోడ్డు-శివరాంసాగర్ చెరువు వరకు రహదారుల నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయింది. మంత్రి సీతక్క ఈ పనులకు 19న శంకుస్థాపన చేయనున్నారు.

బాలిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలి


కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకుంటున్న మరియపురం మాజీ సర్పంచి బాలిరెడ్డి

గీసుకొండ, న్యూస్‌టుడే: ఐదేళ్ల వ్యవధిలో తాను ప్రాతినిధ్యం వహించిన గ్రామాన్ని జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన అల్లం బాలిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతికి చెందిన ఆగ్రశ్రీ సంస్థ 2022-23 ఆర్థిక సంవత్సరానికి గీసుకొండ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామం మరియపురం మాజీ సర్పంచి అల్లం బాలిరెడ్డిని రాజీవ్‌గాంధీ గ్రామ్ స్వరాజ్ నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది. గురువారం తిరుపతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలిరెడ్డికి అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

బాణసంచా విక్రయాలకు దరఖాస్తు చేసుకోండి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా తాత్కాలిక బాణసంచా విక్రయాలకు దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఎన్‌వోసీ, ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసే వారైతే స్థలం యజమాని, ప్రభుత్వ స్థలమైతే అధికారుల అనుమతి పత్రాలను, భవనాల్లో ఏర్పాటు చేస్తే ఇరుగుపొరుగు ఇళ్ల యజమాని అనుమతి పత్రం దరఖాస్తుకు జతచేయాల్సి ఉంటుందని తెలిపారు. భవన బ్లూప్రింట్‌తో పాటు ఎస్‌బీఐ అదాలత్ బ్రాంచ్‌లో రూ.800 చలాన్ ప్రభుత్వ ఖజానా పేరుతో తీయాలని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 23లోపు సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. వాటిని పరిశీలించిన తర్వాత దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇస్తారన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: రైతులు విద్యుత్తు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ డీఈ ఆనందం సూచించారు. దివిటిపల్లి, దమ్మన్నపేట గ్రామాల్లో గురువారం 'విద్యుత్తుశాఖ- పొలంబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈ ఆనందం మాట్లాడుతూ.. విద్యుత్తు మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవడం వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి


మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో.. కమాండెంట్ రామ్‌ప్రకాశ్, అధికారులు


ఎనుమాములలో..

మామునూరు, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో గురువారం వాల్మీకి చిత్రపటానికి కమాండెంట్ బి.రామ్‌ప్రకాశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, వీరన్న, ఆర్ఐలు, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు.


కాశీబుగ్గ: వరంగల్ ఎనుమాములలో గురువారం వాల్మీకి జయంతిని సంఘం ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి బోయ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పెనుకుల సాంబశివరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు నిగ్గులు ఐలయ్య, కుమారస్వామి, రామచంద్రం, మొగిలి, అనీల్, రవిచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి బోనాలు



గిర్మాజీపేట, న్యూస్‌టుడే: గిర్మాజీపేటలోని శ్రీగోవిందరాజస్వామి రథశాల వద్ద గురువారం పెద్దమ్మతల్లి బోనాలు ఘనంగా జరిగాయి. స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ ఆధ్వర్యంలో మహిళలు కలశాలు, భక్తులు పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. రానున్న రోజుల్లో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు కార్పొరేటర్ వెల్లడించారు. చింతకుల సునీల్, బయ్య స్వామి, శివకుమార్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యాపరిశోధన శిక్షణ మండలికి ప్రాజెక్టు ఎంపిక


ఉపాధ్యాయుడు సత్యం

నర్సంపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: నర్సంపేట మండలం లక్నేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డా.శంకరరత్నం రూపొందించిన ప్రాజెక్టు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలికి ఎంపికైంది. రెండు దశల్లో దేశ వ్యాప్తంగా వచ్చిన ప్రాజెక్టుల నుంచి ఉత్తమమైనవి ఎంపిక చేశారు. ఉన్నత పాఠశాల విభాగంలో ఉపాధ్యాయుడు సత్యం రూపొందించిన 'అకడమిక్ అచీవ్‌మెంట్ అండ్ ప్రొఫిషియన్సీ ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ డిస్కోర్స్' ప్రాజెక్టును ఎన్‌సీఈఆర్‌టీ ఎంపిక చేసింది. వచ్చే ఏడాది మార్చి వరకు ఈ ప్రాజెక్టును లక్నేపల్లి జడ్పీ పాఠశాలలో కొనసాగిస్తారు. విద్యార్థులకు వారానికి మూడు తరగతులు నిర్వహించి వివరాలు ఎన్‌సీఈఆర్‌టీకి పంపించనున్నారు. ఇతడు 2019-20లో రూపొందించిన ప్రాజెక్టు యూనిసెఫ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రధానోపాధ్యాయులు మాధురి, ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సంగెం, న్యూస్‌టుడే: పురుగుమందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గవిచర్ల గ్రామానికి చెందిన గుండు సాంబయ్య (60) కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. రెండురోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కాపాడారు. 14న మద్యం మత్తులో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెలంగాణ కూడలిలో యువకుల ఘర్షణ

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: తెలంగాణ కూడలిలో గురువారం రాత్రి యువకులు రెండువర్గాలుగా విడిపోయి పరస్పరం దాడి చేసుకున్నారు. సమీపంలోని ఓ మద్యం దుకాణంలో ఇద్దరు యువకుల మధ్య మొదలైన గొడవ చిలికి చిలికి గాలివానగా మారింది. రెండువర్గాలుగా ఏర్పడి ప్రధాన రహదారిపైనే పరస్పరం దాడి చేసుకున్నారు. ఇందులో ఒకవర్గం వరంగల్ గాంధీనగర్, మరోవర్గం వంచనగిరి వాసులని సమాచారం. దారిన వెళ్లేవారు గొడవ ఏంటని ప్రశ్నిస్తే వారిపైనా దాడులకు పాల్పడ్డారు. సమీపంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు గొడవ ఆపాలని ప్రయత్నించినా.. యువకులు పట్టించుకోలేదు. దీనిని ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వీడియో తీసేందుకు ప్రయత్నించడంతో వారు అక్కడ్నుంచి వెళ్లిపోయారు. తాగిన మైకంలో ట్రాఫిక్ పోలీసులతోనూ వారు వాగ్వాదానికి దిగారు. రెండు వర్గాల పంచాయితీ కారణంగా లేబర్‌కాలనీ, నర్సంపేట ప్రధాన రహదారిలో కొద్దిసేపు ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

వాహనదారులకు జరిమానా

పోచమ్మమైదాన్, న్యూస్‌టుడే: వరంగల్ ట్రాఫిక్ రాజా పరిధిలో మద్యంతాగి వాహనాలు నడిపిన 46 మందికి గురువారం రెండో తరగతి న్యాయమూర్తి వీరస్వామి రూ.67,700 జరిమానా విధించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. పత్రాలు లేకుండా దివ్యాంగ వాహనాలు నడుపుతున్న ముగ్గురికి రూ.4 వేల జరిమానా విధించారు.

నకిలీ విత్తు.. అన్నదాత చిత్తు..!


రైతులతో మాట్లాడుతున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం(నర్సంపేట), న్యూస్‌టుడే: నకిలీ విత్తనాల పట్ల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టినా.. అన్నదాతలు మోసపోయి చివరికి నష్టం మూటగట్టుకుంటున్నారు. ఖానాపురం మండలం ధర్మారావుపేటకు చెందిన కొంతమంది రైతులు సన్నరకం విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేశారు. సగం ఈని.. ఇంకా సగభాగం పొట్టదశలో ఉండటంతో విత్తనాల్లో కల్తీ జరిగిందని గుర్తించి లబోదిబోమంటున్నారు. తామంతా కల్తీ విత్తనాలతో మోసపోయామని గురువారం ఎస్సై రఘుపతికి ఫిర్యాదు చేశారు. అనంతరం పంట పొలాలను చూపించారు. 200 ఎకరాల్లో సగం ఈనిన వరిని చూపించారు. వరంగల్, నర్సంపేట, స్థానిక విత్తన డీలర్ల నుంచి కొనుగోలు చేశామని రసీదులు, బిల్లులు చూపారు. తెలంగాణేతర రాష్ట్రానికి చెందిన ప్రముఖ కంపెనీ విత్తనాలను డీలర్ల నుంచి కొనుగోలు చేశామని వాపోయారు. ఈ సందర్భంగా 'ఈనాడు- ఈటీవీ' వారిని పలకరించింది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి న్యాయం చేయాలని రవి, భిక్షపతి, శ్రీను, మోహన్‌రావు, సంపత్, సంతోష్ కోరారు.

రెండున్నర ఎకరాల్లో సాగు చేశా..

- రవి, రైతు, ధర్మారావుపేట



రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాను. కొంత పంట ఈని గింజలు గట్టిపడ్డాయి. మరికొంత పచ్చగా పొట్టదశలో ఉంది. ఈనిన వరి గింజలు రాలి పోతున్నాయి. 40 శాతం పంటనష్టం జరిగింది. అధికారులు స్పందించి, న్యాయం చేయాలి.

పరిహారం ఇప్పించాలి..

- భిక్షపతి, రైతు



మూడున్నర ఎకరాలు సాగు చేశాను. ఎకరాకు రూ.28 వేలు పెట్టుబడికి ఖర్చయ్యింది. డీలర్లు కంపెనీ అధికారులతో మాట్లాడి నష్ట పరిహారం ఇప్పిస్తామని చెప్పారు. 20 రోజులుగా కాలయాపన చేశారు. వ్యవసాయ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాం.


పచ్చగా ఉండి పాలుపోసుకోని గింజలు

ఏవో దృష్టికి తీసుకెళ్లాను..

- రఘుపతి, ఎస్సై

ధర్మారావుపేట గ్రామానికి చెందిన రైతులు చేసిన ఫిర్యాదుపై వ్యవసాయ అధికారి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి మాట్లాడాను. శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులతో మాట్లాడి పంటను పరిశీలించి వివరాలు సేకరిస్తామని చెప్పారు. మోసం జరిగినట్లు తెలితే చర్యలు తీసుకుంటాం.

దెబ్బతిన్న మిరప తోట


తోటను పరిశీలిస్తున్న అధికారులు

దుగ్గొండి, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముద్దం యుగేందర్ తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో మిరప తోట సాగు చేశారు. నల్లబెల్లిలోని ఓ పురుగుల మందుల దుకాణంలో బయో ఫెస్టిసైడ్ మందును కొనుగోలు చేసి 14న పిచికారీ చేశారు. గురువారం వెళ్లి చూడగా పూత పిందె, మొక్కలు మాడిపోయి ఉన్నాయి. తనకు జరిగిన అన్యాయంపై వ్యవసాయ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి మాధవి, శాస్త్రవేత్తలు ఓంకార్, దిలీప్‌లు సందర్శించి దెబ్బతిన్న మిరప తోటను పరిశీలించారు. మాడి పోయిన మొక్కల నమూనాలను హైదరాబాద్‌లోని బయో ఫెస్టిసైడ్స్ ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు.

సంక్షిప్తంగా

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ఆకేరు వాగులోని ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయసాగర్, ఎస్సై చందర్‌లు హెచ్చరించారు. వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న దారిలో ట్రాక్టర్ల రాకపోకలకు వీలులేకుండా గురువారం గుంతలు తీశారు. ఇసుక దందా అరికట్టడంలో భాగంగా ఇప్పటి వరకు 8 ట్రాక్టర్లను సీజ్ చేసి.. ఎనిమిది మంది యజమానులపై కేసు నమోదు చేశామని, మరో ఇద్దరిని బైండోవర్ చేసినట్లు వివరించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ బియ్యం పట్టివేత

రంగశాయిపేట, న్యూస్‌టుడే: కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోట ప్రాంతంలో ప్రజా పంపిణీ బియ్యాన్ని గురువారం మిల్స్‌కాలనీ పోలీసులు పట్టుకున్నారు. ఓ మహిళ లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. ఆమె ఇంటిపై దాడి చేసి 7 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.17,500 ఉంటుందన్నారు. నిందితురాలు పరారీలో ఉండగా.. కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం వివరించారు.

పోటీలను విజయవంతం చేయాలి

వరంగల్ క్రీడావిభాగం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) క్రీడా పోటీలను విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పోటీల నిర్వహణపై పీడీలు, కోచ్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడారు. తొలి విడతలో ఈ నెల 25, 26న, రెండో విడతలో 28, 29 తేదీల్లో క్రీడా పోటీలు ఉంటాయన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

గీసుకొండ(సంగెం): కొమ్మాల మాజీసర్పంచి వీరాటి కవిత గ్రామంలోని పోచమ్మ దేవాలయానికి కేటాయించిన రూ.10 లక్షలతో అభివృద్ధి చేయకపోవడంతో పాటు లెక్కలు చూపలేదని గురువారం గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి శంకర్‌రావుకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

'పార్టీ శ్రేణులకు అండగా ఉంటా'

రాయపర్తి, న్యూస్‌టుడే: భారాస పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నరసింహనాయక్ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. గురువారం మాజీ మంత్రి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. నాయకులు సుభాష్, వేణు, రవి, రాధ, సుజాత పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో మద్యం స్వాధీనం

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఎస్సై చందర్ గురువారం తెలిపారు. వర్ధన్నపేటలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న రూ.12 వేల విలువ చేసే 72 బీరు సీసాలు స్వాధీనం చేసుకొని, విక్రయదారుడిపై కేసు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్ నుంచి సస్పెన్షన్

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న చెన్నారావుపేటకు చెందిన కుండె కుమారస్వామి అనే కార్యకర్తను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్ గురువారం తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పార్టీకి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

విగ్రహ పునఃప్రతిష్ఠాపన

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్ కాశీబుగ్గ శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో సంకటహర లక్ష్మీగణపతి స్వామి విగ్రహాన్ని గురువారం పునఃప్రతిష్ఠించారు. ఆలయ అర్చకులు శ్రీకాంతాచారి, మధుచార్యుల ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు సామల సదానందం, రామ వెంకటనారాయణ, దాసరి రాజేశ్, బొట్ల సుధాకర్ పర్యవేక్షణలో విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు.

భాజపాతోనే తెలంగాణ అభివృద్ధి

మట్టెవాడ, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి భాజపాతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.వన్నాల వెంకటరమణ తెలిపారు. గురువారం వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా భాజపా సభ్యత్వ నమోదుకు ముందుకు వస్తున్నారన్నారు. వరంగల్ చౌరస్తాలో 600 మంది సభ్యత్వాలు తీసుకున్నారని తెలిపారు. నాయకులు కాసు శిల్ప, స్వర్ణజ, రాజేశ్వరి, ఉషా, సరస్వతి, స్వరూప, దేవిక, అపర్ణ, బాకం హరిశంకర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఖానాపురం: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మంగళవారిపేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

భారాసలో చేరికలు

శివనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ సేవా టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, యూనియన్ నాయకులతో పాటు 32వ డివిజన్ చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం మాజీ ఎమ్మెల్యే నరేందర్ సమక్షంలో భారాసలో చేరారు. పార్టీలో చేరిన వారికి నరేందర్ కండువా కప్పి ఆహ్వానించారు.

నేడు కిట్స్‌లో సంశోధిని-24 ఫెస్ట్

భీమారం: భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ఆధ్వర్యంలో ఈ నెల 18, 19వ తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయస్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం (సంశోధిని-2024-ఫెస్ట్) వేడుకలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు.

ఓంకార్ స్ఫూర్తితో ఉద్యమాలు


తెలంగాణ రైతు సంఘం భవన్‌లో..

గిర్మాజీపేట, లేబర్‌కాలనీ, గీసుకొండ, న్యూస్‌టుడే: భూస్వామ్య శక్తుల ఆగడాలపై మడమ తిప్పని పోరాటం సాగించిన ఓంకార్ స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలు నిర్మించాలని సామాజిక ఉద్యమ నాయకుడు సోమ రామ్మూర్తి అన్నారు. ఓంకార్ వర్ధంతి సందర్భంగా అబ్బనికుంట తెలంగాణ రైతు సంఘం భవనంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పిస్తూ. . నినాదాలు చేశారు. రైతు సంఘం నాయకులు సోమిడి శ్రీనివాస్, ఓదెల రాజయ్య, ఊరటి అంశాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

☛ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత ఎం.ఓంకార్ వర్ధంతిని గురువారం గీసుకొండ మండలం మచ్చాపురంలోని స్మారక స్తూపం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఆచార్యుడు మార్క శంకర్‌నారాయణ హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పూలు చల్లి.. నిరసన తెలిపి..



శివనగర్, న్యూస్‌టుడే: ప్రమాదకర గుంతలను పూడ్చాలని భాజపా నేతలు డిమాండ్ చేశారు. గురువారం భాజపా రాష్ట్ర నాయకుడు ముత్తినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు వరంగల్ అండర్‌బ్రిడ్జి జీపు అడ్డా వద్ద గుంతల్లో గులాబీ పూలు చల్లి నిరసన తెలిపారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. అటు ఆర్‌అండ్‌బీ, ఇటు బల్దియా అధికారులు ఎవరూ స్పందించడం లేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మెంగని కృష్ణ, అచ్చరాజు, రాము, ఓదెలు, మల్లయ్య, మొగిలి, నారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

నిజాయతీ చాటిన ఆటో చోదకుడు

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: పాపయ్యపేట గ్రామానికి చెందిన ఆటో చోదకుడు నూనె రాజేశ్ నిజాయతీ చాటుకున్నాడు. గురువారం తన ఆటోలో ప్రయాణించిన కట్టమ్మ చేతి సంచి మరిచిపోయింది. గమనించిన రాజేశ్ తిరిగి వారి ఇంటికి వెళ్లి సంచి అప్పగించారు. బ్యాగులో రూ.6వేలు, విలువైన పత్రాలు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు.

ఐక్య ఉద్యమాలతో హక్కుల సాధన


మహాసభలో అభివాదం చేస్తున్న ఐద్వా మహిళా నేతలు

నర్సంపేట, న్యూస్‌టుడే: మహిళా సాధికారత పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాగ్దానాలు చేసి అమలు చేయడంలో విఫలమైనట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.రత్నమాల ఆరోపించారు. గురువారం నర్సంపేటలో జరిగిన పట్టణ మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హక్కుల సాధనతో పాటు సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్వప్న, ఉమా, ఫరీదా, నాగమణి, ప్రవళిక, లక్ష్మి, శ్రీలత, విజయ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: దళితులపై దాడులు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రతినిధి, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్ డిమాండ్ చేశారు. గురువారం నర్సంపేటలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నారావుపేట, నల్లబెల్లి మండలంలోని దళితులను కొంత మంది కులం పేరుతో దూషించినట్లు పేర్కొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అజయ్ పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, బోధన రుసుం, ఉపకార వేతనాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం నర్సంపేటలో అమరవీరుల స్తూపం వద్ద రాస్తారోకో చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో శ్రీనివాస్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

నర్సంపేట నియోజకవర్గం

పత్తి రైతులను ఆదుకోవాలి

నర్సంపేట, న్యూస్‌టుడే: పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేటలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల శ్రేయస్సు పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు.

బకాయిల చెల్లింపునకు కృషి చేయాలని వినతి



నర్సంపేట, న్యూస్‌టుడే: బోధన, ఉపకార వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేసేందుకు కృషి చేయాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు గురువారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని నర్సంపేటలో కలిసి వినతిపత్రం అందజేశారు. జి.ప్రభాకర్ రెడ్డి, జె.సాగర్, ఎం.రాంరాజ్, టి.మల్లేశ్, రాజేశ్, బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం


ప్రసంగిస్తున్న రంగయ్య

ఖానాపురం, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల కోసం పోరాటాలు చేయాలన్నారు. కులమత, ప్రాంతీయ విభేదాలతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. నేతలు సాయిలు, తిరుపతి, బాబు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మత ప్రచారకుల అడ్డగింత

ఖానాపురం, న్యూస్‌టుడే: మండలంలోని మంగళవారిపేటలో గురువారం క్రైస్తవ మతంలో చేరాలని ప్రచారం చేస్తున్న ప్రచారకులను స్థానికులు అడ్డుకున్నారు. ఏ మతంలో పుట్టారో ఆ మతంలోనే ఉంటారని బలవంతంగా మత మార్పిడి చేయించడం సరికాదని పేర్కొన్నారు. గ్రామంలో ఇంటింటి ప్రచారం చేసి వెళ్లి పోయినట్లు స్థానికులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నెక్కొండ, న్యూస్‌టుడే: మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన ముడుసు రామమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సహాయం అందించడానికి గ్రామ వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్పందించి రూ.29,300 జమ చేశారు. గురువారం గ్రామస్థులు కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా నర్సంపేట: 99635 59929 కార్పొరేషన్: 98484 09191 వర్ధన్నపేట: 99896 42307 వరంగల్ ఈస్ట్: 97053 46535 (10 AM TO 1 PM)

శ్మశాన వాటికలో వ్యర్థాల తొలగింపు



స్పందనకు వందనం

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: పుప్పాలగుట్ట శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ఎట్టకేలకు తొలగించారు. పారిశుద్ధ్యం లోపించడంతో దహన సంస్కారాలు నిర్వహించే సమయంలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకువచ్చారు. 36వ డివిజన్ శానిటరీ జవాను అఖిల్ వివరణతో 'మేమున్నాం మీకుతోడుగా' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో స్పందన లభించింది. గురువారం పొక్లెయిన్, పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని మంచినీటి బావిలో పేరుక పోయిన చెత్త చెదారంను గురువారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. పైపులైన్ లీకేజీకి గురై నీరు కలుషితం కావడంతో బ్లీచింగ్ ఫౌడర్ వేశారు.

కాలువ శుభ్రం

శివనగర్: 35వ డివిజన్ శివనగర్‌లోని ఇంటి నెంబరు 16-10-1143 ముందు ప్రధాన మురుగు కాలువ శుభ్రం చేయడం లేదని.. స్థానికుడు శ్రీధర్ ఈనాడు దృష్టికి తీసుకువచ్చారు. 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా విషయాన్ని స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామికి తెలియజేయడంతో స్పందన లభించింది. గురువారం జేసీబీ యంత్రం ద్వారా కాలువ శుభ్రం చేయించారు.

వీధిదీపాలకు మరమ్మతులు

శివనగర్: శివనగర్ 34వ డివిజన్ వాసవికాలనీలో రెండు రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదని స్థానికురాలు ఓరుగంటి విమల, ఫోర్టురోడ్డు వినాయక నగర్‌కాలనీలో వీధి దీపాలు వెలగడంలేదని స్థానికురాలు రమనీల తెలిపారు. రెండు కాలనీల్లోని సమస్యను బల్దియా ఎలక్ట్రికల్స్ ఏఈ నరేష్ దృష్టికి తీసుకెళ్లగా.. గురువారం మరమ్మతులు చేయించారు.

చదరంగం పోటీల గోడప్రతులు ఆవిష్కరణ

వరంగల్ క్రీడావిభాగం: రాష్ట్రస్థాయి చదరంగం పోటీల ప్రచార గోడప్రతులను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆవిష్కరించారు. గురువారం మట్టెవాడలోని ఆయన నివాసంలో వరంగల్ జిల్లా చదరంగం సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. ఓరుగల్లు బిడ్డ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో చదరంగం క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో అండర్-15 విభాగంలో బాలబాలికలకు హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో పోటీలు ఉంటాయని కార్యనిర్వహణ ప్రతినిధి కన్నా తెలిపారు. పూర్తి వివరాలకు 90595 22986లో సంప్రదించాలన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం తగదు

వర్ధన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభలు ఏర్పాటు చేసి ఎంపిక చేయాలని తెలుగుదేశం పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చాడ మరియా సురేఖ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపిక చేయాలనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు.

పర్వతగిరి: గ్రామ సభల్లోనే ఇందిరమ్మ కమిటీలను ఎన్నుకునేలా చర్యలు చేపట్టి, లబ్ధిదారులకు న్యాయం చేయాలని భారాస మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్‌లకు భారాస నాయకులు వినతిపత్రం అందజేశారు.